సాక్షి విశాఖపట్నం

శనివారం । 21 । అక్టోబర్ । 2023



న్యూస్‌రీల్

విద్యాలక్ష్మిగా కనకమహాలక్ష్మి



శ్రీపుష్పయాగంలో విద్యాలక్ష్మిగా సిరులతల్లి

దాబాగార్డెన్స్: కనకమహాలక్ష్మి దేవస్థానంలో నిర్వహిస్తున్న శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా శుక్రవారం కనకమహాలక్ష్మి విద్యాలక్ష్మి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారికి శ్రీపుష్పయాగం నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా సంకల్పం, మండపారాధన, కలశస్థాపన, సప్తశతి, మహావిద్యా, శ్రీచక్ర నవావర్ణార్చన జరిపారు. శనివారం అమ్మవారు గజలక్ష్మిగా దర్శనమివ్వనున్నారని, లక్ష గాజులతో పూజలు నిర్వహించనున్నట్టు ఈవో కె.శిరీష చెప్పారు.

సింహగిరిపై ఘనంగా ఆయుధపూజ



స్వామివారి ఆయుధాలు

సింహాచలం : సింహగిరిపై శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో జరుగుతున్న విజయ దశమి మహోత్సవాల్లో భాగంగా మూల నక్షత్రాన్ని పురస్కరించుకుని శుక్రవారం ఆయుధ పూజను ఘనంగా నిర్వహించారు. ఆలయంలో సింహవల్లీతాయారు సన్నిధిలో పూజలను శాస్త్రోక్తంగా జరిపారు. శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామివారి ఆయుధాలైన గద, ధనస్సు, బాణం, కత్తి, పరశురామ గొడ్డలి, ఖైజార్ తదితర ఆయుధాలను ఉంచారు. విష్వక్సేణపూజ, పుణ్యాహవాచనం, ఆయుధ దేవాత ఆవాహనం, ఆరాధన నిర్వహించారు. ఆయుధాలకు విశేషంగా హారతులిచ్చారు. అనంతరం పూజలో ఉంచిన ఆయుధాలను సింహవల్లీ తాయారుకి అలంకరించారు. ఆలయ స్థానాచార్యులు టీపీ రాజగోపాల్ తదితరులు పూజను నిర్వహించారు. ఈనెల 24వ తేదీ విజయదశమి వరుకు సింహవల్లీ తాయారు సన్నిధిలోనే ఆయుధాలను ఉంచుతారు. రోజూ విశేషంగా ఆరాధన నిర్వహిస్తారు.

నేడు 23 ప్రాంతాల్లో 'జగనన్న ఆరోగ్య సురక్ష'

మహారాణిపేట: జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు శుక్రవారం 23 ప్రాంతాల్లో నిర్వహించారు. అర్బన్ పరిధిలో 19 ప్రాంతాల్లోను, రూరల్‌లో రెండు ప్రాంతాల్లో ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించారు. మొత్తం 6493 మంది రోగులకు వైద్య శిబిరాల్లో సేవలు అందించారు. అర్బన్‌లో 5540, రూరల్‌లో 953 మందికి వైద్య సేవలు అందించినట్టు జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు తెలిపారు.

జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు శనివారం 23 ప్రాంతాల్లో నిర్వహించనున్నారు. అర్బన్ పరిధిలో 22 ప్రాంతాల్లోను, రూరల్‌లో ఒక ప్రాంతంలో వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నారు. రూరల్‌లో ఆనందపురం పరిధిలో వెల్లంకి వైద్యశిబిరం నిర్వహించనున్నట్టు డీఎంహెచ్‌వో డాక్టర్ పి.జగదీశ్వరరావు తెలిపారు.

పైసా ఖర్చు లేకుండా..
కార్పొరేట్ ఫిజియోథెరపీ

విమ్స్ పేరు వినగానే రోగులకు కార్పొరేట్ వైద్య సేవలు గుర్తుకొస్తాయి. ప్రశాంత వాతావరణం, కార్పొరేట్ స్థాయి పడకలు, ఐసీయూ గదులు, వసతులు, అత్యాధునిక వైద్య పరికరాలు ఇక్కడి రోగుల సేవలకు అందుబాటులో ఉన్నాయి. అన్ని విభాగాల వైద్య నిపుణులు సేవలు అందిస్తున్నారు. అతి తక్కువ ధరలకు సీటీ స్కానింగ్, ఎక్స్‌రే, రక్త రీక్షలు చేస్తున్నారు. వీటితో పాటు ఉచిత ఫిజియోథెరపీ సేవలు కూడా అందుబాటులోకి వచ్చాయి.



విమ్స్‌లో రీహేబిలిటేషన్ సెంటర్



రీహేబిలిటేషన్ సెంటర్‌లో పరికరాలు



వృద్ధురాలికి లేజర్ థెరపీ చేస్తున్న సిబ్బంది

- విమ్స్‌లో స్పైనల్, న్యూరో రీహేబిలిటేషన్ సెంటర్ ఏర్పాటు
- ఇక్కడి పరికరాలతోనే ఫిజియోథెరపీలో ఉచిత వైద్య సేవలు

ఆరిలోవ: విశాఖ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(విమ్స్)లో కార్పొరేట్ స్థాయి ఆధునిక పరికరాలతో ఉచిత ఫిజియోథెరపీ సేవలను రోగులకు అందిస్తున్నారు. ఇటీవల స్పైనల్ అండ్ న్యూరో రీహేబిలిటేషన్ సెంటర్‌ను ఏర్పాటు చేశారు. వైద్యాధికారులు ఇందులో ఉన్న ఆధునిక పరికరాలను ఉపయోగించి అవసరమైనవారికి ఫిజియోథెరపీ సేవల్ని ఉచితంగా అందిస్తున్నారు. వీటితో పాటు ఇక్కడ స్పీచ్ థెరపీ, ఆడియో థెరపీ అందుబాటులో ఉంది. కోమా, పక్షవాతంతో బాధపడిన అనంతరం పూర్తి స్థాయిలో కోలుకోవడానికి ప్రత్యేక సేవలు అందిస్తున్నారు.

పక్షవాత రోగులకు ప్రత్యేక ఐసీయూ

పక్షవాతంతో బాధపడుతున్నవారికి ప్రత్యేక ఐసీయూ ఏర్పాటు చేశారు. ఇందులో ఆధునిక పడకలు అమర్చి ఇన్‌పేషెంట్ సేవలు అందిస్తున్నారు. ప్రైవేట్ కార్పొరేట్ ఆస్పత్రుల్లో ఈ సేవల్ని పొందాలంటే నెలకు కనీసం రూ.2 లక్షల నుంచి రూ.3 లక్షల వరకు ఖర్చు అవుతుంది. విమ్స్‌లో మాత్రం ఈ సేవలు పూర్తిగా ఉచితమేనని వైద్యులు చెప్తున్నారు. వీటితో పాటు లేజర్ థెరపీ, కంటిన్యూయస్ పాసివ్ మోషన్(సీపీఎం) థెరపీ, ఎక్సర్‌సైజ్ థెరపీ, ఎలక్ట్రో థెరపీ, సస్పెన్షన్ థెరపీ, మొబిలిటీ థెరపీ, ఇన్‌ఫ్రారెడ్(ఐఆర్ఆర్), ఆల్ట్రాసౌండ్, మజిల్ స్టిమ్యులర్స్, ఇంటర్ ఫెరెన్షియల్ థెరపీ(ఐఎఫ్‌టీ), రోబోటిక్ గ్లౌజ్, టెన్స్, షార్ట్‌వేవ్ థెరపీ తదితర సేవలు అందుబాటులో ఉన్నాయి.

అందుబాటులో ఉన్న యంత్రాలు

కార్పొరేట్ ఆస్పత్రులకు మించి, విమ్స్‌లో అత్యాధునిక వైద్య పరికరాలను ఏర్పాటు చేశారు. ట్రాక్షన్ మిషన్, సీపీ వాకర్, ఫింగర్ లేడర్, ఆల్ట్రా సౌండ్, ట్రెడ్ మిల్, స్పైన్ డీ ట్రాక్, మొబిలిటీ ట్రైనర్, స్టిమ్యులేటర్, ర్యాంప్ వాకర్, పేర్లాక్ బార్, స్టాటిక్ సైకిల్స్, షోల్డర్ వీల్, స్విల్ బాల్, పెగ్ బోర్డు, బ్యాలన్స్ బోర్డు, డంబెల్స్, వోబుల్ బోర్డు, థ్రెడ్ బ్యాండ్ తదితర యంత్రాలు వినియోగిస్తున్నారు. వీటిని విజయవాడ, హైదరాబాద్, ముంబయ్ ప్రాంతాల నుంచి తీసుకొచ్చి, ఇక్కడ ఏర్పాటు చేశారు.

దీర్ఘకాలిక రోగులకు వరం

ఈ కేంద్రంలో ఆరుగురు ఫిజియోథెరపిస్టులు అందుబాటులో ఉన్నారు. వారితో పాటు మరికొందరు సహాయక సిబ్బంది ఉన్నారు. దీర్ఘకాలంగా ఎముకల వ్యాధులతో బాధపడుతున్నవారు, కీళ్ల నొప్పులు, మెడ నొప్పులు, వెన్నుపూస నొప్పులు, ఆర్థరైటిస్ సమస్యలు, టెండాన్ సమస్య తదితర వాటితో బాధపడుతున్నవారికి అందుబాటులో ఉన్న ఆధునిక యంత్రాలను ఉపయోగించి వైద్య సేవలు అందిస్తున్నారు. దీంతో పాటు ప్రమాదాలకు గురై, ఆపరేషన్ తర్వాత కాళ్లు, చేతులు కోల్పోయినవారికి రీహేబిలిటేషన్ కింద కృత్రిమ అవయవాలు అందిస్తున్నారు. పక్షవాత రోగులకు ప్రత్యేక థెరపీ ఇస్తున్నారు.

ఉచిత సేవలను వినియోగించుకోండి



విమ్స్‌లో ఈ మధ్యనే స్పైనల్ అండ్ న్యూరో రీహేబిలిటేషన్ సెంటర్ ఏర్పాటు చేసి, ఉచిత సేవలు అందిస్తున్నాం. ఆధునిక పరికరాలు అందుబాటులో ఉంచాం. ఇక్కడ ఉచితంగా అందించే థెరపీని కార్పొరేట్ ఆస్పత్రుల్లో పొందాలంటే రూ.లక్షలు వెచ్చించాలి. పక్షవాతంతో నడవలేని స్థితిలో ఉన్నవారి కోసం ప్రత్యేక ఐసీయూ సేవలు ఉచితంగా అందిస్తున్నాం. చెవిటి, మూగ బాధితులకు స్పీచ్, ఆడియో థెరపీ, కాక్లియర్ ఇంప్లాంటేషన్ జరిగినవారికి ప్రత్యేక స్పీచ్ థెరపీ అందిస్తున్నాం. ఆరుగురు ఫిజియోథెరపీ వైద్యులతోపాటు సహాయక సిబ్బందితో సేవలు అందిస్తున్నాం.

– డాక్టర్ కె.రాంబాబు, డైరెక్టర్, విమ్స్

విశాఖ వేదికగా ఫిబ్రవరిలో
మిలాన్-2024



యుద్ధ నౌకల విన్యాసాలు (ఫైల్)

- 19 నుంచి 27 వరకూ నిర్వహించనున్న భారత నౌకాదళం
- 50 దేశాలకు ఆహ్వానం పంపించిన నేవీ అధికారులు
- వైజాగ్ రికార్డు.. విశాఖలోనే బద్దలుకొట్టేలా..
- చరిత్రలో అతిపెద్ద మిలాన్‌గా రికార్డ్ తిరగరాయనున్న తూర్పు నౌకాదళం
- 2022లో 39 దేశాలతో విన్యాసాల నిర్వహణ
- లోగో ఆవిష్కరించిన ఇండియన్ నేవీ

సాక్షి, విశాఖపట్నం : మరో అంతర్జాతీయ విన్యాసాలకు వేదికగా నిలిచేందుకు విశాఖ మహానగరం సన్నద్ధమవుతోంది. 2022లో ప్రెసిడెంట్ ఫ్లీట్ రివ్యూ, మిలాన్‌ను వరుసగా నిర్వహించి.. సత్తా చాటిన మహా నగరం.. 2024 ఫిబ్రవరిలో మరోసారి మిలాన్ విన్యాసాలకు ఆహ్వానం పలుకుతోంది. నౌకాదళ విభాగంలో కీలకమైన మిలాన్ కోసం భారీ ఏర్పాట్లు చేసేందుకు ఇండియన్ నేవీ ఇప్పటి నుంచే ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. ఈసారి గత రికార్డుని తిరగరాసేలా.. భారత నౌకాదళం 50 దేశాలతో భారీ స్థాయిలో విన్యాసాలు నిర్వహించేందుకు సన్నద్ధమవుతోంది. తాజాగా మిత్రదేశాలతో వీడియో కాన్ఫరెన్స్‌నిర్వహించిన భారత నౌకాదళం శుక్రవారం మిలాన్-2024 లోగో, పోస్టర్‌ని ఆవిష్కరించింది.

2016లో ఇంటర్నేషనల్ ఫ్లీట్ రివ్యూను ఘనంగా నిర్వహించి సాహో విశాఖ అని ప్రపంచ దేశాల మన్ననలు పొందిన నగరం.. 2022లో ప్రెసిడెంట్ ఫ్లీట్ రివ్యూతో సత్తా చాటింది. నెల రోజుల వ్యవధిలోనే ఐఎఫ్ఆర్ తర్వాత నౌకాదళ విన్యాసాల్లో కీలకమైన మిలాన్-2022ను నిర్వహించి ప్రపంచదేశాలకు భారత రక్షణదళ సత్తాని చాటింది. ఇప్పుడు మరోసారి మిలాన్‌కు విశాఖ ఆతిథ్యమిచ్చేందుకు ముస్తాబవుతోంది. మిలాన్-2024 పేరుతో ఈ విన్యాసాలను ఈస్టర్న్ నేవల్ కమాండ్ ప్రధాన స్థావరంలో వచ్చే ఏడాది ఫిబ్రవరిలో నిర్వహించనున్నారు. ఫిబ్రవరి 19 నుంచి 27 వ తేదీ వరకూ రెండు దశల్లో ఈ విన్యాసాలు జరగనున్నాయి. హార్బర్ ఫేజ్‌లో అంతర్జాతీయ మారీటైమ్ సెమినార్, ఆర్కే బీచ్‌లో సిటీ పరేడ్, స్వావలంబన్ ఎగ్జిబిషన్, సబ్జెక్ట్ ఎక్స్‌పర్ట్ ఎక్స్ఛేంజ్, యంగ్ ఆఫీసర్స్ మిలన్ తదితర అంశాలు జరగనున్నాయి. సీ ఫేజ్‌లో భారత్‌తో పాటు ఆయా దేశాల యుద్ధ నౌకలు, జలాంతర్గాములు, యుద్ధ విమానాలు, హెలికాప్టర్లతో యుద్ధ విన్యాసాలు, అత్యాధునిక వైమానిక రక్షణ కార్యకలాపాలు, యాంటీ సబ్‌మెరైన్ వార్‌ఫేర్, యాంటీ సర్ఫేస్ వార్‌ఫేర్ విన్యాసాలు విశాఖ సముద్ర జలాల్లో జరగనున్నాయి. ఈ సారి జీ20 థీమ్ అయిన వసుధైక కుటుంబం అనే నినాదంతో మిలాన్ నిర్వహించాలని భారత రక్షణ మంత్రిత్వ శాఖ నిర్ణయించింది.



మిలాన్-2024 లోగో

వైజాగ్ రికార్డు..
వైజాగ్‌లోనే తిరగరాసేలా..

1995లో మిలాన్ విన్యాసాలు ప్రారంభమయ్యాయి. తొలిసారి జరిగిన విన్యాసాల్లో భారత్‌తో పాటు ఇండోనేషియా, సింగపూర్, శ్రీలంక, థాయ్‌లాండ్ దేశాలు మాత్రమే పాల్గొన్నాయి. ప్రతి రెండేళ్లకోసారి నిర్వహించే మిలాన్‌లో ఏటా దేశాల సంఖ్య పెరుగుతూ వస్తోంది. మొత్తంగా ఇప్పటి వరకూ 12 సార్లు మిలాన్ విన్యాసాలు జరిగాయి. 2022లో విశాఖ వేదికగా జరిగిన మిలాన్‌లో ఏకంగా 39 దేశాలు పాల్గొని రికార్డు సృష్టించింది. ఆ రికార్డుని మళ్లీ విశాఖలోనే తిరగరాయనున్నారు. మిలాన్-2024 విన్యాసాల్లో పాల్గొనేందుకు ఇప్పటికే భారత నౌకాదళం ఏఏ దేశాలకు ఆహ్వానాలు పంపించాలనే అంశంపై ప్రణాళికలు సిద్ధం చేసుకుంటోంది. దక్షిణాసియా, ఆగ్నేయాసియా, ఆఫ్రికా, యూరప్‌లలో మొత్తం 50 దేశాలకు ఆహ్వానాలు పంపించారు. మొత్తం అన్ని దేశాలు హాజరయ్యే అవకాశం ఉన్నందున.. అతి పెద్ద మిలాన్‌కు వేదికగా విశాఖ మరోసారి రికార్డు సృష్టించనుంది. వివిధ దేశాల మధ్య సహృద్భావ వాతావరణంలో స్నేహ పూర్వక సత్సంబంధాల్ని మెరుగు పరచుకోవడంతో పాటు శత్రుసైన్యానికి బలం, బలగం గురించి నిత్యం తెలియజేసేందుకు ఈ విన్యాసాలు నిర్వహిస్తుంటారు. 2024 ఫిబ్రవరిలో జరగనున్న మిలాన్ బహుపాక్షిక విన్యాసాలను భారత నౌకాదళం సారథ్యం వహించనున్నట్లు రక్షణ మంత్రిత్వ శాఖ పేర్కొంది.

ప్రైవేటు కాలేజీల్లో తనిఖీలు

సాక్షి ఎఫెక్ట్..

విశాఖ విద్య: విశాఖ నగరంలోని పలు ప్రైవేటు జూనియర్ కాలేజీలను ఇంటర్మీడియెట్ బోర్డు ప్రాంతీ పర్యవేక్షణాధికారి రాయల సత్యనారాయణ శుక్రవారం తనిఖీ చేశారు. 'సెలవుల్లోనూ కాలేజీల నిర్వహణ'అనే శీర్షికన 'సాక్షి' దినపత్రికలో ప్రచురితమైన కథనం సర్వత్రా చర్చనీయాంశమైంది. దీనిపై ఇంటర్మీడియెట్ బోర్డు ఉన్నతాధికారులతో పాటు, బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సైతం స్పందించారు. దసరా సెలవుల్లో కాలేజీలు తెరవడానికి వీల్లేదని స్పష్టమైన ఉత్తర్వులు ఇచ్చినప్పటికీ, విశాఖ నగరంలోని కొన్ని ప్రైవేటు కాలేజీలు నిర్వహించారు. 'సాక్షి' పరిశీలనతో విద్యార్థులను గురువారం సాయంత్రమే హడావుడిగా కాలేజీల నుంచి ఇళ్లకు పంపించారు. నగరంలోని వివిధ ఏరియాల్లో ఉన్న శైట్, ఫిట్జీ, డెల్టాస్, వృక్ష జూనియర్ కాలేజీల్లో తనిఖీలు చేసినట్లు ఆర్ఐవో సత్యనారాయణ తెలిపారు. వాటిలో విద్యార్థులు ఎవ్వరూ లేరని తేలిందన్నారు. దసరా సెలవుల్లో ఎటువంటి స్పెషల్ క్లాసులు నిర్వహించడానికి వీల్లేదని కాలేజీల యాజమాన్యాలకు సూచించామన్నారు. ప్రైవేటు కాలేజీలపై నిఘా ఉంటుందన్నారు.

నేడు కేజీహెచ్‌లో పలు ప్రారంభోత్సవాలు

మహారాణిపేట: కింగ్ జార్జ్ ఆస్పత్రిలో కీలకమైన కార్డియాలజీ విభాగాన్ని పునర్ నిర్మించారు. సీఎస్సార్ నిధులు నుంచి రూ. 24 లక్షలను కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున మంజూరు చేశారు. ఈ నిధులతో కార్డియాలజీ వార్డును పునర్ నిర్మించారు. గుండె జబ్బుల విభాగాన్ని కార్పొరేట్ స్థాయిలో తీర్చిదిద్దారు. ఏపీ వైద్య ఆరోగ్య మౌలిక సదుపాయాల సంస్థ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ నాయుడు ఆధ్వర్యంలో డీఈఈ మన్మథరావు పనులు శరవేగంగా పూర్తి చేసినట్టు కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.అశోక్ కుమార్ తెలిపారు. ఈ వార్డును జిల్లా ఇన్‌చార్జి, రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని శనివారం ప్రారంభించనున్నారు. అలాగే 120 కేవీ సోలార్ ప్రాజెక్టును కూడా మంత్రి ప్రారంభించనున్నారు.



పునర్ నిర్మించిన కార్డియాలజీ వార్డు

ఉద్యోగాల కల్పనలో 'గైస్'కు రాష్ట్రస్థాయి అవార్డు

మురళీనగర్: విద్యా సంవత్సరంలో అత్యధికంగా విద్యార్థులకు ఉద్యోగాలు కల్పించిన ఉత్తమ పాలిటెక్నిక్ కాలేజీగా కంచరపాలెం ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగ్ కాలేజీ (గైస్) గుర్తింపు పొందింది. ఈమేరకు గుంటూరు నాగార్జున యూనివర్సిటీలో రాష్ట్ర సాంకేతిక విద్యాశాఖ ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన అడ్వాన్సింగ్ అకాడమియా-ఇండస్ట్రియల్ కొలాబిరేషన్ కార్యక్రమంలో ఈ అవార్డును ప్రకటించారు. 2022-23 విద్యా సంవత్సరంలో ఈ కాలేజీలో చదువుతున్న 189మంది విద్యార్థుల్లో 165మంది ఉద్యోగాలకు ఎంపిక కావడమే కాకుండా వీరందరూ ఉద్యోగాల్లో చేరినందుకు ఈ అవార్డును ప్రకటించారు. వీరిలో 54 మంది బాలికలు ఉండడం విశేషం. ఈ మేరకు రాష్ట్ర సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ సి.నాగరాణి చేతుల మీదుగా గైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వెంకటరమణ అవార్డును అందుకున్నారు. రానున్న కాలంలో మరిన్ని విజయాలు సాధించాలని కమిషనర్ సి.నాగరాణి సూచించారు. కార్యక్రమంలో కాలేజీ టీపీవో సీహెచ్.జయప్రకాష్‌రెడ్డి పాల్గొన్నారు.



కమిషనర్ నాగరాణి చేతుల మీదుగా బెస్ట్ పెర్ఫార్మెన్స్ అవార్డు అందుకుంటున్న గైస్ ప్రిన్సిపాల్ వెంకటరమణ



సింహగిరికి విద్యుత్ బస్సులు

- ట్రయల్ రన్ నిర్వహించిన ఒలెక్ట్రా సంస్థ
- తిరుమల మాదిరిగా కొండపైకి నడిపే ప్రయత్నం

సాక్షి, విశాఖపట్నం/సింహాచలం: సింహగిరికి విద్యుత్ బస్సులు నడపడంపై కసరత్తు జరుగుతోంది. తిరుపతి-తిరుమల మధ్య ఇప్పటికే ఎలక్ట్రిక్ బస్సులు నడుస్తున్న సంగతి తెలిసిందే. ఇదే తరహాలో అప్పన్న కొండపైకి కూడా విద్యుత్ బస్సులను ప్రవేశపెట్టాలని సింహాచలం దేవస్థానం తలపోస్తోంది. ప్రస్తుతం ఈ దేవస్థానం కొండ దిగువ నుంచి కొండపైకి రెండు బస్సులను నడుపుతోంది. వీటి స్థానంలో ఎలక్ట్రిక్ బస్సులను తిప్పాలన్న ప్రతిపాదనకు దేవదాయశాఖ కమిషనర్ నుంచి ఆమోదం లభించింది. ఇందులో భాగంగా విద్యుత్ బస్సుల తయారీ సంస్థ ఒలెక్ట్రా హైదరాబాద్ నుంచి ఒక బస్సును సింహాచలానికి పంపింది. ఈ బస్సుతో గురు, శుక్రవారాల్లో దేవస్థానం అధికారులు, పాలకమండలి సభ్యులు, ఆర్టీసీ అధికారులు ట్రయల్ రన్ నిర్వహించారు. ఆర్టీసీ నడుపుతున్న ఈ సైజ్ బస్సులకు సింహగిరి ఘాట్ రోడ్డుపై ఎలాంటి ఇబ్బంది తలెత్తడం లేదు. ప్రతిపాదిత విద్యుత్ బస్సు.. ఆర్టీసీ బస్సు సైజుకంటే 0.8 మీటర్లు ఎక్కువ పొడవుంది. దీంతో ఈ ఘాట్ రోడ్డుపై ఉన్న మలుపులు తిరగడానికి ఏమైనా సమస్యలు ఎదురవుతాయా? చార్జింగ్ వంటి అశాలను పరిశీలించారు. అయితే ఈ ట్రయల్ రన్‌లో అలాంటి ఇబ్బందులేర్పడ లేదు.



ట్రయల్ రన్‌లో ఎలక్ట్రిక్ బస్సు

ఏసీ సర్వీసుపై సందిగ్ధత..

ప్రస్తుతం తిరుపతి-తిరుమల మధ్య నడుస్తున్న ఎలక్ట్రిక్ బస్సులకు ఏసీ సదుపాయం ఉంది. ప్రతిపాదిత సింహాచలం కొండపైకి నడపనున్న ఈ-బస్సులకూ ఏసీ సౌకర్యం ఉండనుంది. దాదాపు గంటకు పైగా ప్రయాణం ఉండడంతో తిరుమల విద్యుత్ బస్సులకు ఆదరణ ఉంటోంది. కానీ సింహాచలం కొండ దిగువ నుంచి కొండపైకి కేవలం 4 కి.మీల దూరం ఉంది. ఈ స్వల్ప దూరానికే విద్యుత్ ఏసీ బస్సులకు డిమాండ్ ఉంటుందా? అన్న దానిపై చర్చించారు. నాన్ ఏసీ విద్యుత్ బస్సులను ప్రవేశపెట్టడమే మంచిదన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

దృష్టి సారించిన ఆర్టీసీ..

మరోవైపు ఆర్టీసీ రాష్ట్రంలో వెయ్యి విద్యుత్ బస్సులను కొనుగోలు చేస్తోంది. వీటిలో విశాఖకు తొలిదశలో 100, రెండో దశలో 100 బస్సులు చొప్పున కేటాయించే అవకాశం ఉంది. మరికొన్ని నెలల్లోనే తొలివిడత విద్యుత్ బస్సులు విశాఖ రానున్నాయి. ఈ-బస్సులు వస్తే కొన్నింటిని సింహాచలం కొండపైకి కూడా నడపాలని యోచిస్తున్నామని, అందుకే ఈ ట్రయల్ రన్‌లో తాము కూడా పాల్గొన్నామని ఆర్టీసీ డీపీటీవో ఎ.అప్పలరాజు 'సాక్షి'కి చెప్పారు. సింహగిరి ఘాట్‌రోడ్డులో ఎలక్ట్రిక్ బస్సు ట్రయల్ రన్‌లో దేవస్థానం ట్రస్ట్ బోర్డు చైర్మన్ అశోక్‌గజపతిరాజు, ఈవో శ్రీనివాసమూర్తి పాల్గొన్నారు. ఒక్కో విద్యుత్ బస్సు కొనుగోలుకు రూ.1.60 కోట్లు వెచ్చిస్తున్నందున ఘాట్‌రోడ్డులో బస్సులు ఏమేర సామర్థ్యాన్ని కలిగి ఉంటాయో పరిశీలించారు.





● సరస్వతీ నమస్తుభ్యం.. వీణాపుస్తకధారిణీం..



డాబాగార్డెన్స్: కురుపాం మార్కెట్‌లో కొలువైన కన్యకాపరమేశ్వరి శుక్రవారం సరస్వతీ దేవిగా దర్శనమిచ్చారు. ప్రధాన అర్చకుడు ఆర్.బి.బి. కుమార్ శర్మ చిన్నారులు, విద్యార్థులతో సరస్వతి పూజ నిర్వహించారు.



తగరపువలస: ఆంధ్రా బ్యాంకు రహదారి మండపంలో సరస్వతీ దేవి అలంకరణలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు.




అక్కిరెడ్డిపాలెం: ఎస్టీబీఎల్‌లోని ఎల్ఎన్ గార్డెన్స్‌లో కొలువైన పోలమాంబ.. సరస్వతీ దేవిగా దర్శనమిచ్చారు. వేలాదిగా పెన్నులు, వివిధ రకాల నోటు పుస్తకాలతో అమ్మవారిని అలంకరించారు.

● ధనలక్ష్మి



స్టీల్‌ప్లాంట్: ఉక్కునగరంలోని త్రిశక్తి ఆలయంలో ధనలక్ష్మి అలంకరణలో శ్రీ మహాలక్ష్మి భక్తులకు దర్శనమిచ్చారు. సుమారు లక్ష రూపాయల రూ.100, 50, 20, 10 కరెన్సీ నోట్లతో అమ్మవారిని అలంకరించారు.

● గాజులతో అలంకరణ



కంచరపాలెం: ఎర్నిమాంబ అమ్మవారిని, ఆలయ గర్భగుడిని సుమారు 9 లక్షల గాజులతో అలంకరించారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారి ని దర్శించుకున్నారు.

నాలుగో తరగతి సిబ్బందికి దుస్తుల పంపిణీ

మహారాణిపేట: విజయదశమి పురస్కరించుకుని కలెక్టరేట్ నాలుగో తరగతి, సెక్యూరిటీ, పారిశుధ్య సిబ్బందికి కలెక్టర్ ఎ.మల్లికార్జున దుస్తులు, మిఠాయిలు పంపిణీ చేశారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో శుక్రవారం జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. జిల్లా ప్రజలంతా విజయదశమిని సుఖ సంతోషాలతో జరుపుకోవాలని ఆకాంక్షించారు. చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీక విజయదశమి అని అన్నారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కె.ఎస్.విశ్వనాథన్, డీఆర్వో కె.మోహన్‌కుమార్, కలెక్టరేట్ పరిపాలన అధికారి ఈశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.



ఉద్యోగులకు దుస్తులు అందజేస్తున్న కలెక్టర్ మల్లికార్జున, చిత్రంలో జేసీ విశ్వనాథన్, డీఆర్వో మోహన్‌కుమార్

చెల్లని చెక్కు జారీ చేసిన వ్యక్తికి ఏడాది జైలు

విశాఖ లీగల్: చెల్లని చెక్కు జారీ చేసిన సాయిజీరావుకు ఏడాది జైలు శిక్ష, రూ.10,000 జరిమానా విధిస్తూ నగరంలోని ఏడవ అదనపు ప్రధాన మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ శుక్రవారం తీర్పు చెప్పారు. జరిమానా చెల్లించిన పక్షంలో అదనంగా మూడు నెలల సాధారణ జైలు శిక్ష అనుభవించాలని ఆ తీర్పులో పేర్కొన్నారు. వివరాలివీ.. నిందితుడు సింహాద్రి సాయిజీరావు ద్వారకానగర్‌లో ఉంటున్నాడు. ఫిర్యాది శ్రీధర్, సాయిజీరావు స్నేహితులు. ఈ నేపథ్యంలో శ్రీధర్.. అతనికి రూ.10 లక్షలు అప్పుగా ఇచ్చారు. అప్పు తీర్చే నిమిత్తం 2019లో సాయిజీరావు రూ.10 లక్షల చెక్‌ను శ్రీధర్‌కి ఇచ్చాడు. ఆ చెక్కును శ్రీధర్ తన ఖాతాలో జమ చేయగా తగినన్ని నిధులు లేని కారణంగా బౌన్స్ అయింది. దీంతో శ్రీధర్ న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి పైవిధంగా తీర్పునిచ్చారు.

ప్రభుత్వం దృష్టికి ఇళ్ల స్థలాల కేటాయింపు అంశం

జర్నలిస్టులతో కలెక్టర్ మల్లికార్జున

సీతమ్మధార: విశాఖలోని అక్రిడిటేషన్ జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు కేటాయించే అంశాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని కలెక్టర్ ఎ.మల్లికార్జున హామీ ఇచ్చారు. విశాఖ అక్రిడిటేటెడ్ వర్కింగ్ జర్నలిస్ట్ హౌసింగ్ సొసైటీ కార్యవర్గ సభ్యులు శుక్రవారం కలెక్టర్‌ను ఆయన కార్యాలయంలో కలిశారు. సొసైటీ గౌరవ అధ్యక్షులు కె.జి.రాఘవేంద్రారెడ్డి, జనార్దనరావు, అధ్యక్షుడు బి.రవికాంత్ బృందం 2006–2022 వరకు అక్రిడిటేషన్ కలిగిన జర్నలిస్టుల వివరాలను ఆయనకు అందజేశారు. 18 ఏళ్లుగా ఇళ్ల స్థలాల కోసం ఎదురు చూస్తున్న జర్నలిస్టులకు న్యాయం చేయాలని కోరారు. దీనిపై కలెక్టర్ సానుకూలంగా స్పందించి.. జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు కేటాయించే అంశాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళతానని చెప్పారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో సొసైటీ సలహాదారులు పి.సత్యనారాయణ, డి.రవికుమార్, కోశాధికారి ఆలపాటి శరత్‌కుమార్, ఉపాధ్యక్షులు డి.మురళీకృష్ణారెడ్డి, కొయిలాడ పరశురాం, సహాయ కార్యదర్శులు కె.అనురాధ, ఎం.చిట్టిబాబు, ఆర్గనైజింగ్ కార్యదర్శి బొప్పన రమేష్, తదితరులు పాల్గొన్నారు.

ఏఎంఎన్ఎస్ రూ.50 లక్షల విరాళం

దొండపర్తి: జిల్లాలోని సంక్షేమ వసతి గృహాల్లో మౌలిక సదుపాయాల కల్పన కోసం ఆర్సెల్లార్ మిట్టల్ నిప్పన్ స్టీల్ ఇండియా లిమిటెడ్(ఏఎంఎన్ఎస్) రూ.50 లక్షలు విరాళం అందించేందుకు ముందుకొచ్చింది. కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ(సీఎస్సార్)లో భాగంగా సంక్షేమ హాస్టళ్లలో సదుపాయాల కోసం ఈ నిధులను వెచ్చించనున్నారు. ఈ సందర్భంగా సంస్థ హెచ్ఆర్ అండ్ అడ్మిన్ హెడ్ డి.ఎస్.వర్మ శుక్రవారం కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జునను తన చాంబర్‌లో కలిశారు. సీఎస్సార్ నిధుల కింద రూ.50 లక్షలు అందించేందుకు అంగీకారం తెలుపుతూ కలెక్టర్‌కు లేఖ అందజేశారు. సామాజిక బాధ్యత కింద ఏఎంఎన్ఎస్ సంస్థ చేపడుతున్న కార్యక్రమాలను కలెక్టర్ అభినందించారు.



కలెక్టర్ మల్లికార్జునకు లేఖ అందజేస్తున్న ఏఎంఎన్ఎస్ హెచ్ఆర్ అండ్ అడ్మిన్ హెడ్ డి.ఎస్.వర్మ

31 మందికి అక్రిడిటేషన్ల జారీకి ఆమోదం

మహారాణిపేట: కలెక్టర్ ఎ.మల్లికార్జున ఆధ్వర్యంలో ఆయన చాంబర్‌లో శుక్రవారం నాలుగో విడత జిల్లా మీడియా అక్రిడిటేషన్ కమిటీ సమావేశం జరిగింది. ఈ మేరకు 31 మంది జర్నలిస్టులకు అక్రిడిటేషన్ల జారీకి ఆమోదం తెలుపుతూ కమిటీ నిర్ణయం తీసుకుంది. అనంతరం అక్రిడిటేషన్ కార్డులు పొందిన జర్నలిస్టులకు కలెక్టర్ చేతులమీదుగా హెల్త్ కార్డులు అందజేశారు. మరోసారి అక్రిడిటేషన్ జర్నలిస్టులందరికీ డయాగ్నోస్టిక్ క్యాంప్ నిర్వహించి వైద్య పరీక్షలు చేస్తామని కలెక్టర్ తెలిపారు. మిగిలిన వారికి కూడా త్వరలోనే హెల్త్‌కార్డులు అందజేస్తామన్నారు. హెల్త్ కార్డుల కోసం దరఖాస్తుల సమర్పణ, నగదు చెల్లింపు, ఇతర విషయాల్లో సందేహాలుంటే కిశోర్(80086 56504), లావణ్య(81435 04193)లను సంప్రదించాలని సూచించారు. జిల్లా మీడియా అక్రిడిటేషన్ కమిటీ కన్వీనర్ వి.మణిరామ్, సభ్యులు కె.జి.రాఘవేంద్రారెడ్డి(సాక్షి), ఎస్.ఎస్.ఆర్.కె.బాపూరావు(గ్రేటర్ న్యూస్), ఎస్.అనురాధ(హెచ్ఎంటీవీ), ఎం.చిట్టిబాబు(ఎస్.డి.వి.న్యూస్), అసిస్టెంట్ లేబర్ కమిషనర్ మోహనలక్ష్మి పాల్గొన్నారు.



హెల్త్‌కార్డులు అందజేస్తున్న కలెక్టర్ మల్లికార్జున

ఒడ్డుకు చేరిన విద్యార్థి మృతదేహం

బీచ్‌రోడ్డు: ఆర్.కె.బీచ్ వద్ద సముద్రంలో గురువారం గల్లంతైన ఇంటర్ విద్యార్థి రాహుల్ కుమార్ మృతదేహం శుక్రవారం ఒడ్డుకు చేరింది. ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న ఏడుగురు స్నేహితులు గురువారం సముద్రంలో స్నానం చేస్తుండగా.. భారీ కెరటానికి రాహుల్, హర్షవర్ధన్ చిక్కుకున్నారు. బీచ్‌గార్డ్స్ హర్షవర్ధన్‌ను అతికష్టం మీద ఒడ్డుకు తీసుకువచ్చి.. ఆస్పత్రికి తరలించారు. అప్పటికే అతను మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. రాహుల్ కోసం గురువారం సాయంత్రం వరకు పోలీసులు, మెరైన్ పోలీసులు, కోస్ట్‌గార్డ్స్ ముమ్మరంగా గాలించినా ఫలితం లేకుండా పోయింది. శుక్రవారం ఉదయం గోకుల్ పార్క్ ఎదురుగా ఉన్న తీరంలో రాహుల్ మృతదేహాన్ని గుర్తించిన సందర్శకులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు అక్కడకు చేరుకుని మృతదేహాన్ని కేజీహెచ్‌కు తరలించారు. అక్కడ పోస్టుమార్టం పూర్తయిన అనంతరం మృతదేహాన్ని అతని తల్లిదండ్రులకు అప్పగించారు.



రాహుల్ మృతదేహం

వాహనం ఢీకొని 32 గొర్రెలు మృతి

పరవాడ: పరవాడ–లంకెలపాలెం రహదారిలోని డంపింగ్ యార్డు సమీపంలో గుర్తు తెలియని వాహనం ఢీ కొన్న ఘటనలో 32 గొర్రెలు మృతి చెందాయి. స్థానికులు, పోలీసులు అందించిన వివరాలివీ.. విజయనగరం ప్రాంతానికి చెందిన బొబ్బిలి శ్రీను, వారాధి సత్తిబాబు, నరసింహమూర్తి, పత్రి అప్పన్న, సూరిబాబు తమ గొర్రెల మందలను పరవాడ ప్రాంతానికి తోలుకొచ్చారు. పరవాడ పరిసర ప్రాంతాల్లో గురువారం మేతకు తీసుకువెళ్లారు. సాయంత్రం డంపింగ్ యార్డు సమీపంలో మందను ఉంచి గొర్రెల కాపరులు రాత్రి భోజన విరామం అనంతరం నిద్రపోయారు. శుక్రవారం తెల్లవారుజామున పరవాడ నుంచి లంకెలపాలెం వైపు అతివేగంగా వస్తున్న వాహనం రోడ్డుకు సమీపంలో నిద్రపోతున్న గొర్రెలపై నుంచి దూసుకుపోవడంతో 32 గొర్రెలు అక్కడికక్కడే మృతి చెందాయి. వీటి విలువ సుమారు రూ.4 లక్షలు ఉంటుందని కాపరులు చెప్పారు. ప్రమాదాన్ని గుర్తించిన గొర్రెల కాపరులు వాహనాన్ని అడ్డగించినా ఫలితం లేకపోయింది. పరవాడ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. కాగా.. గొర్రెల కాపరులకు తగిన న్యాయం చేయాలని సిటు నేత గనిశెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు.



మృతి చెందిన గొర్రెలు

హోంగార్డును ఢీ కొట్టిన కారు

కొమ్మాది: విధి నిర్వహణలో ఉన్న హోంగార్డును ఓ కారు ఢీ కొట్టిన ఘటన జాతీయ రహదారిపై చోటు చేసుకుంది. వివరాలివీ.. ఎండాడ సిగ్నల్ పాయింట్ వద్ద శుక్రవారం హోంగార్డు పైడిరాజు విధులు నిర్వర్తిస్తున్నారు. సిగ్నల్ పాయింట్ వద్ద ఓ కారు ఆగిపోవడంతో ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా ముందుకు నెడుతున్నారు. ఈ సమయంలో మధురవాడ నుంచి నగరం వైపు వస్తున్న ఓ కారు అతివేగంగా వచ్చి పైడిరాజును ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో ఆయనకు తీవ్ర గాయాలయ్యాయి. కాలు విరిగిపోయిందని వైద్యులు తెలిపారు. ప్రస్తుతం గీతంలో చికిత్స పొందుతున్నాడు. ఈ ఘటనకు కారణమైన కారు డ్రైవర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కేసు దర్యాప్తులో ఉంది.



చికిత్స పొందుతున్న పైడిరాజు

సేవల్లో లోపం.. గృహ నిర్మాణ సంస్థకు జరిమానా

విశాఖ లీగల్: వినియోగదారుడికి సేవా లోపం కలిగించినందుకు అదనంగా కట్టిన సొమ్మును తొమ్మిది శాతం వడ్డీతో ఆరు నెలల్లో చెల్లించాలని వినియోగదారుల మండలి(2) న్యాయమూర్తి గేదెల వెంకటేశ్వరి తీర్పునిచ్చారు. వినియోగదారుడు అదనంగా చెల్లించిన 1,13,805 రూపాయలు, నష్ట నష్టపరిహారం కింద రూ.4 లక్షలు, రూ.10 వేల కోర్టు ఖర్చులు చెల్లించాలని ఆ తీర్పులో స్పష్టం చేశారు. సీనియర్ న్యాయవాది ఆదిరెడ్డి శ్రీధర్ ఫిర్యాది తరఫున కేసు దాఖలు చేశారు. వివరాలివీ.. ఫిర్యాది నొపడ నాగభూషణరావు ప్రస్తుతం రంగారెడ్డి జిల్లాలో ఉంటున్నారు. గతంలో ఆయన బీఎస్ఎన్ఎల్‌లో డిప్యూటీ ఇంజినీర్‌గా పనిచేసేవారు. 2013 అక్టోబర్ 5న నెలలో రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ విశాఖలోని పలు ప్రాంతాల్లో ఇంటి స్థలాలు, నిర్మాణంలో ఉన్న ఇళ్లను విక్రయించడానికి ఓ ప్రకటన జారీ చేసింది. ఆ ప్రకటన మేరకు నాగభూషణరావు ఓ దరఖాస్తు చేసుకున్నారు. ఈ మేరకు పరదేశిపాలెం దగ్గరలోని ఎం.ఐ.జి ఇంటిని ఇవ్వడానికి గృహ నిర్మాణ సంస్థ అంగీకరించింది. లాటరీ పద్ధతిలో నాగభూషణం పేరు ఎంపిక కావడంతో ఆయనకు ప్లాట్ నంబర్ 195 కేటాయించింది. దీంతో నాగభూషణం పలు దఫాలుగా రూ.23,00,000తో పాటు అదనంగా రూ.1,13,805 చెల్లించారు. గడువు ముగిసినప్పటికి ఇంటిని గానీ, స్థలాన్ని గానీ ఆయనకు కేటాయించలేదు. దీనిపై పలుమార్లు ఆయన కార్యాలయం చుట్టూ తిరిగితే.. చివరకు నంబర్ 195 ప్లాట్ కేటాయించారు. కొన్ని నెలలు గడిచిన తర్వాత ఇంటి నిర్మాణం సాధ్యం కాదని గృహ నిర్మాణ సంస్థ చేతులెత్తేసింది. కనీస వసతులు కూడా కల్పించలేదు. తన నుంచి అదనంగా వసూలు చేసిన సొమ్ము వాపసు ఇవ్వాలని, కనీస వసతులు విద్యుత్, ప్రహరీ, మంచినీరు సౌకర్యం కల్పించాలని ఆయన ఫోరంను ఆశ్రయించారు. ఈ కేసును విచారించిన న్యాయమూర్తి వెంకటేశ్వరి, సభ్యులు కనక రమణబాబు, విజయేశ్వరిలు పై విధంగా తీర్పు చెప్పారు.